## రైతులకు ఇబ్బంది కలుగొద్దు..

### సివిల్ సప్లయ్ డీటీ త్రిఅంబక్‌రావు


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీటీ త్రిఅంబక్‌రావు

ఉట్నూర్ రూరల్, మే 20 : రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సివిల్ సప్లయ్ డీటీ త్రిఅంబక్‌రావు అన్నారు. సోమవారం గంగన్నపేట్, బిర్సాయిపేట్ గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వెంటనే తేమ శాతం చూసి తూకం చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని, ప్రైవేటు వ్యక్తులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. తేమ శాతం తక్కువగా ఉండే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులు లక్ష్మీపతి, రాజేశ్వర్, రాజన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

## రూ.3 లక్షల చెక్కు అందజేత


రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 20 : ఆర్మీలో పనిచేస్తూ సర్వీసులో ఉండగా గతేడాది 2023 ఆగస్టు 6న సోలంకి సుధాకర్ మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చిన ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ రాజర్షి షా అందించారు. కలెక్టర్ చాంబర్‌లో సుధాకర్ భార్య పూజకు రూ.3 లక్షల చెక్కును జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీపీఆర్వో తిరుమల, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌దాస్, సభ్యులు దేవన్న, అశోక్, తిరుపతిరెడ్డి, వామన్‌రెడ్డి పాల్గొన్నారు.


విత్తన దుకాణంలో వ్యవసాయశాఖ అధికారులతో రైతుల వాగ్వాదం

# నో స్టాక్

- విత్తన దుకాణాల ఎదుట దర్శనమిస్తున్న బోర్డులు
- వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే అనుమానం
- విత్తనాలు దొరుకకపోవడంతో ఆందోళనకు దిగుతున్న అన్నదాతలు
- అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో దుస్థితి

ఆదిలాబాద్, మే 20(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విత్తనాల కొరతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నల్లరేగడి నేలలు, అధిక వర్షపాతం పత్తి పంటకు అనుకూలం కాగా రైతులు ఎక్కువగా తెల్లబంగారాన్ని సాగు చేస్తారు. ఈ ఏడాది 4.20 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేయగా.. దాదాపు 10 లక్షలకు పైగా విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయి. సీజన్‌కు ముందుగానే అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలి. గతేడాది రైతులు తమకు అవసరమైన విత్తనాల కోసం దుకాణాల ఎదుట క్యూలైన్‌లో నిల్చొని పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకున్నది. పలు దుకాణాల్లో ఆర్‌సీహెచ్ 659 విత్తనాల నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సోమవారం ఉదయం పత్తి విత్తనాల కోసం వచ్చిన రైతులు తమకు కావాల్సిన విత్తనాలు లేకపోవడంతో ఆందోళన చేపట్టారు. వ్యవసాయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పడంతో శాంతించారు. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పత్తి విత్తనాలు కొరత తీర్చడానికి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కొరత నిజమైనా..

పత్తి సాగుచేసే రైతులు వివిధ కంపెనీలకు చెందిన బీటీ-2 పత్తి విత్తనాలను ఉపయోగిస్తారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 55 కంపెనీలతో మాట్లాడి విత్తనాల కొరత లేకుండా చూస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆర్‌సీహెచ్ 659 విత్తనాలు



విత్తన దుకాణం ఎదుట పోలీసులు

అందుబాటులో ఉండకపోవడంపై రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరో పదిహేను రోజుల్లో వానకాలం సీజన్ ప్రారంభంకానుడడంతో రైతులు విత్తనాలు వేస్తారు. ఇందుకోసం తమ భూముల్లో మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలను ఎంచుకుంటారు. గతంలో కొన్ని విత్తనాల డిమాండ్ ఉండగా ఈ సారి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. గత గురువారం కలెక్టర్ రాజర్షి షా వ్యవసాయ శాఖ అధికారులు, విత్తనాలు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించి విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాపారుల వద్ద పత్తి విత్తనాల స్టాక్ ఉన్నా విక్రయించడం లేదని రైతులు అంటున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారని అంటున్నారు. వానకాలం సాగుకు రైతులు సన్నద్ధం అవుతుండగా, ప్రారంభంలోనే విత్తనాల సమస్య నెలకున్నది. ఈ ఏడాది సాగు అన్నదాతల్లో ఆందోళన కలిగిస్తున్నది.

# వానకాలం ప్రణాళిక ఖరారు

- నిర్మల్ జిల్లాలో 4.33 లక్షల ఎకరాల సాగు
- అత్యధికంగా 1.68 లక్షల ఎకరాలు పత్తి
- 1.35 లక్షల ఎకరాల్లో వరి.. లక్ష ఎకరాలు సోయా
- అందుబాటులో వరి, పత్తి, సోయా విత్తనాలు
- 53 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- ప్రస్తుతం అందుబాటులో 13 వేల ఎంటీఎస్‌ల యూరియా
- 2,600 ఎంటీఎస్‌ల డీఏపీ.. 7 వేల ఎంటీఎస్ కాంప్లెక్స్ ఎరువులు

నిర్మల్, మే 20(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లావ్యాప్తంగా 4,33,300 ఎకరాల్లో పత్తి, వరి, మక్క, సోయా, పప్పు దినుసులు పండించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా వరి, కంది, పెసర, మినుము విత్తనాలను అందించేందుకు ఏర్పాట్లు చేసింది. అలాగే పత్తి, సోయా విత్తనాలను కూడా అందుబాటులో ఉంచారు. పత్తి 1.68 లక్షల ఎకరాలు, వరి 1.35 లక్షల ఎకరాలు, సోయా లక్ష ఎకరాలు, మక్క 18 వేల ఎకరాలు, కందులు 10 వేల ఎకరాలు, 1000 ఎకరాల్లో మినుములు, పెసర్లు, ఇతర పంటలు సాగు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. వరి సాగును తగ్గించి, పత్తి పంటతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతును ప్రోత్సహించే ప్రయత్నాలు చేస్తున్నారు.


సాగవుతున్న పత్తి (ఫైల్)

### 53 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

ఎరువులు, విత్తనాల అవసరం గురించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. పంటలకు అవసరమైన విత్తనాలను డీలర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఎరువుల కొరత రాకుండా బఫర్ స్టాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా డీలర్ల వద్ద 1,710 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, 23,900 క్వింటాళ్ల వరి విత్తనాలు, 25 వేల క్వింటాళ్ల సోయా విత్తనాలు, 1,440 క్వింటాళ్ల మక్క విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈసారి వానకాలానికి 53 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేయగా, ప్రస్తుతం 22,600 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. జిల్లాకు 34,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా, ప్రస్తుతం 13 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. అలాగే 12 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరముండగా, 7 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. 6,500 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరముండగా, ప్రస్తుతం జిల్లాలో 2,600 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అవసరాన్ని బట్టి మిగతా ఎరువులను కూడా తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### నకిలీ విత్తనాలపై నిఘా

మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు పటిష్ట నిఘా పెట్టారు. ఇప్పటికే విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. మండలానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయగా, ఈ బృందంలో ఆ మండల పరిధిలోని ఎస్సై, వ్యవసాయ అధికారి ఉంటారు. అలాగే జిల్లా స్థాయిలో పోలీసు శాఖ నుంచి సీఐ, వ్యవసాయాధికారి, విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్‌తో కూడిన బృందం ఈ తనిఖీలను పర్యవేక్షిస్తారు. జిల్లాలోని 19 మండలాల పరిధిలో ప్రభుత్వ అనుమతితో విత్తనాలను విక్రయించేందుకు 450 విత్తన దుకాణాలు ఉన్నాయి. మరోవైపు రైతులకు నాణ్యమైన విత్తనాల కొరత లేకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

### లాభదాయక పంటలు వేయాలి..



*రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిస్తూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను వేసి లాభాలబాట పట్టాలి. సాగులో మెలకువలు పాటించాలి. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరఫరా చేస్తున్నది. నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆన్‌లైన్ విధానంతోపాటు, క్యూఆర్ కోడ్ అమల్లోకి తీసుకొచ్చింది. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోకుండా అధికారులను సంప్రదించాలి. రైతులు కచ్చితంగా లైసెన్సు కలిగి ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలి. గ్రామాల్లోకి వచ్చి తక్కువ ధరకు ఇచ్చే విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు.*

*- అంజీప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, నిర్మల్.*


సమీక్ష నిర్వహిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

## కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

### నిర్మల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్ టౌన్, మే 20 : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు, వివిధ అంశాలపై రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో మిల్లులకు తరలించాలని, కొనుగోలు వివరాలను కచ్చితంగా ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. గ్రామాలు, మండలాలవారీగా ధాన్యం కొనుగోలు వివరాలు, రైతుల సంఖ్య, మిల్లులకు తరలించిన లారీల వివరాలు, ట్యాబ్‌లో ఎంట్రీ చేసిన సంఖ్య, పెండింగ్ ట్యాబ్ ఎంట్రీ వివరాలు, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎం సివిల్ సప్లయ్ అధికారిణి శ్రీకళ, డీఎస్‌వో నందిత, తదితరులు పాల్గొన్నారు.


సమీక్షకు హాజరైన అధికారులు

## విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ

నార్నూర్, మే 20 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజాలింగం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారి రమేశ్, ఏఎస్‌ఐ గంగారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం ప్రారంభం కానున్న తరుణంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.


నార్నూర్ ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



## హరితహారం చెట్లపై గొడ్డలి వేటు

బజార్‌హత్నూర్ రోడ్డుకు ఇరువైపులా చెట్లను నరికేసిన విద్యుత్ అధికారులు

- కరెంటు తీగలకు అడ్డుగా ఉన్నాయని నరికివేత
- వందలాది చెట్లను నేలపాలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు

*“**కేసీఆర్ సర్కారు హరితహారంలో** భాగంగా కోట్లాది మొక్కలను నాటించింది. అవి పెరిగి పెద్దవై పండ్లు, నీడను ఇస్తున్నాయి. రహదారులకు ఇరువైపులా నాటి, ట్రీగార్డులు ఏర్పాటు చేసి, నీటిని అందించడంతో ఏపుగా పెరిగాయి. రహదారి వెంట వెళ్లే ప్రజలు, వాహనదారులకు నీడను ఇస్తున్నాయి. ఇటువంటి చెట్లపై కాంగ్రెస్ సర్కారు కన్నేసింది. కనీసం నీరు కూడా పోయడం లేదు. ఫలితంగా మొక్కలు ఎండిపోతున్నాయి. పెరిగిన చెట్లను కూడా విద్యుత్ శాఖ అధికారులు కరెంటు తీగలకు అడ్డుగా ఉన్నాయని వందలాది చెట్లను నరుకుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామ సమీపంలో ఇచ్చోడ-సోనాల వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపుల ఉన్న చెట్లు నేలపాలై దర్శనమిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చెట్లపై చిన్నచూపు చూడడంతో ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని చెట్లను నరికి వేయకుండా చూడాలని కోరుతున్నారు.*

*- బజార్‌హత్నూర్, మే 20*

# పిల్లల అప్పగింత

- అన్నం పెట్టించిన ఆటోవాలాలు
- సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఎస్‌బీ కానిస్టేబుల్
- అనంతరం వారి తల్లిదండ్రుల చెంతకు..

ఎదులాపురం, మే 20 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన అక్కాతమ్ముళ్లు ఆత్రం మీనాక్షి(8), ఆత్రం కార్తీక్(6)లు ఈనెల 20న ఉదయం వారి అక్కయ్యతో బస్సులో ఆదిలాబాద్‌కు వచ్చారు. స్థానిక పంజాబ్ చౌక్‌లోని ఒక సెలూన్ వద్ద బస్సు దిగారు. తమ అక్కయ్య ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. మూడు గంటలైనా రాకపోవడంతో పిల్లలు భయపడుతున్నారు. ఇది గమనించిన స్థానిక ఆటోడ్రైవర్లు వారి వివరాలు తెలుసుకుని ముందుగా భోజనం చేయించారు. తరువాత పోలీసులకు ఫోన్ చేశారు. నిమిషాల్లో అక్కడికి వచ్చిన ఎస్‌బీ కానిస్టేబుల్ దేవిదాస్ వివరాలు తెలుసుకున్నాడు. తమది నిర్మల్ జిల్లా అని చెప్పారు. తరువాత కానిస్టేబుల్ 1098 బాలరక్షక్ మొబైల్‌కు ఫోన్ చేశాడు. చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ సతీష్‌కు వారిని అప్పగించారు. అనంతరం పిల్లలను ఆదిలాబాద్ సీడబ్ల్యూసీ వారు నిర్మల్ సీడబ్ల్యూసీకి సోమవారం సాయంత్రం అప్పగించారు. వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా.. బ్యాంకు వెళ్లొస్తానని చెప్పిన వారి అక్కయ్య ఏమైందనే విషయం తెలియడం లేదు.


పిల్లలను చైల్డ్‌లైన్ అప్పగిస్తున్న ఎస్‌బీ కానిస్టేబుల్ చిందం దేవిదాస్


అడ్మిషన్ పత్రాలు విద్యార్థులకు అందజేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

## అడ్మిషన్ పత్రాలు అందజేత

నిర్మల్ అర్బన్, మే 20 : నిర్మల్‌లోని సోఫినగర్ గురుకుల కళాశాలలో టీఎస్‌ఆర్‌జేసీ సెట్ -2024లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబర్చిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు సోమవారం కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి జాబితాలో సీటు సాధించిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి అడ్మిషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్, అధ్యాపకులు వేణుగోపాల్, దీపక్, మహేశ్, సంతోష్ పాల్గొన్నారు.

## టెట్ ప్రశాంతం

ఎదులాపురం, మే 20 : మొదటి రోజైన సోమవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో రెండు విడుతలుగా ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు కొనసాగాయి. ఉదయం పరీక్షకు 57 మందికి 32 మంది, మధ్యాహ్నం 100 మందికి 81 మంది హాజరు కాగా, 44 మంది గైర్హాజరయ్యారని సెంటర్ ఇన్‌చార్జి పున్నారావు తెలిపారు.

## జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

ఎదులాపురం, మే 20 : వాతావరణ శాఖ సూచనల మేరకు ఆదిలాబాద్ జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాల కారణంగా జొన్నల కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తామని పేర్కొన్నారు. 26వ తేదీన కొనుగోలు పునః ప్రారంభిస్తామన్నారు. జిల్లా రైతులు గమనించి మార్కెట్ యార్డ్‌కు నిలిపివేసిన తేదీల్లో జొన్నలను తీసుకు రావద్దని విజ్ఞప్తి చేశారు.


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## పని భారాన్ని తగ్గించాలి

ఎదులాపురం, మే 20 : అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ రెండవ ఏఎన్‌ఎంలకు పని భారాన్ని తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జనాభా ప్రాతిపదికన రెండవ ఏఎన్‌ఎంలను కేటాయించాలని కోరారు. ఇక్కడ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ నవీన్‌కుమార్, ఏఎన్‌ఎం, నాయకులు పుష్పలత, తులసి, అన్నపూర్ణ ఉన్నారు.

## భవనంపై నుంచి పడి హమాలీ మృతి

లక్ష్మణచాంద, మే 20: హమాలీ పని చేయడానికి వచ్చి భవనంపై నుంచి పడి కూలీ మృతి చెందిన ఘటన మునిపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన లాల సహని(28) మండలంలోని మునిపెల్లి గ్రామానికి హమాలీ పని చేయడానికి వచ్చాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని ఆదర్శ భవనంపైన తోటి హమాలీ కూలీలతో కలిసి నిద్రించాడు. రాత్రి 2.30 గంటల సమయంలో బాత్రూం కోసం కిందికి దిగుతుండగా అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సహకారంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బీహార్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు. అతని సోదరుడు వకీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.